ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3 వరంగల్
శనివారం 6 ఏప్రిల్ 2024

విజ్ఞానం.. వినోదం..



విద్యార్థిని కూచిపూడి నృత్యం

- నిట్‌లో కన్నుల పండువగా స్ప్రింగ్ స్ప్రీ వేడుకలు ప్రారంభం
- వసంతోత్సవ సంబురంతో క్యాంపస్‌లో సందడే సందడి
- మొదలైన వివిధ ఈవెంట్లు.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- మూడు రోజుల పాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు



నుక్కడ్ నాటక్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నిట్‌లో జరిగిన ప్రో షోలో పాటలు పాడుతున్న సింగర్స్ శిరీషా, హరిచరణ్





మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర్ సుబుధి

విద్యార్థులకు సాంకేతిక విద్యా విజ్ఞానాన్నే కాదు.. వినోదాన్ని కూడా పంచేలా వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్‌లో ప్రతీ ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్ప్రింగ్ స్ప్రీ (వసంతోత్సవం) వేడుకలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సాంస్కృతిక మేళా కోసం వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన వేలాది మంది విద్యార్థులతో క్యాంపస్ సందడిగా మారింది. ఈ ఉత్సవాలను వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర్ సుబుధి ప్రారంభించారు. ఇక మొత్తం 50కిపైగా ఈవెంట్లకు గాను తొలిరోజు 17ఈవెంట్లను నిర్వహించారు. అలాగే రాత్రి నిట్ స్టేడియంలో నిర్వహించిన కొరియోనైట్ పాప్‌షో ఉర్రూతలూగించగా.. మ్యూజిక్‌కు అనుగుణంగా విద్యార్థులు కేరింతలు కొడుతూ చిందులేశారు. చౌరస్తా, హరిచరణ్ బ్యాండ్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

వివరాలు 5లో..



పాత బస్‌స్టేషన్‌లో ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తవ్వుతున్న దృశ్యం

వరంగల్ కొత్త బస్టాండ్ పనులు షురూ

- పాత భవనాల కూల్చివేత
- బస్టాండ్‌కు రాకపోకల నిలిపివేత

4లో..



రైల్లో పట్టుకున్న గంజాయిని చూపుతున్న రైల్వే పోలీసు బృందం

10 బ్యాగులు.. 203 కిలోలు..

- రైలులో భారీగా ఎండు గంజాయి పట్టివేత
- ఇద్దరు మహిళల అరెస్టు

6లో..

శుక్రవారం ఉష్ణోగ్రతలు
గరిష్టం : 41.0°C
కనిష్టం : 24.0°C

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	శనివారం	సా : 6.36 గం..
సహర్ :	ఆదివారం	ఉ : 4.43 గం..

‘ఆయుర్వేదం’పై నిర్లక్ష్యం!

బోధనాసుపత్రిని పట్టించుకోని ప్రభుత్వం



- ఉద్యోగులు, సిబ్బంది కొరతతో అందని సేవలు
- రిటైర్ అయిన వారి స్థానాలు ఏళ్లుగా ఖాళీగానే..

గిర్మాజీపేట, ఏప్రిల్ 5 : దీర్ఘకాలిక, మొండి రోగాలే కాకుండా అల్లోపతికి కూడా లొంగని రోగాలకు సంపూర్ణ వైద్య చికిత్స అందిస్తున్న ఆయుర్వేదంపై ప్రజలు విశ్వాసం చూపుతున్నా ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యం చేస్తోంది. మైగ్రేన్, మోకాళ్ల, నడుము నొప్పులు, స్పాండిలైటిస్, అర్షమొలలు, డయాబెటిక్ ఫుట్, వెరికోస్‌వేన్స్ లాంటి వాటికి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి.. సిబ్బంది కొరత, సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వాలు మారుతున్నా ఆయుర్వేదం ఆసుపత్రికి మహర్దశ రావటంలేదనే విమర్శలున్నాయి. వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో అధునాతన భవనాలు, మౌలిక సదుపాయాలతో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిలోని 120పడకల ఇన్‌పేషంట్ వార్డులో నిత్యం 90 మంది వరకు ఉచితంగా చికిత్స పొందుతుంటారు. వీరిలో ఉమ్మడి వరంగల్‌తో పాటు ఖమ్మం, కరీంనగర్ జిల్లాలు, ఏపీ, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల నుంచి కూడా వచ్చే రోగులుంటారు.

మంత్రి సురేఖపై ఆశలు



మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనే అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, ప్రభుత్వ ఆయుర్వేద బోధన అస్పత్రి ఉండటంతో సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. గతంలో ఈ కళాశాల అభివృద్ధి విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన కొండా సురేఖ మంత్రిగా మరోసారి దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ఉద్యోగులు, సిబ్బంది నియామకం, ఎక్స్‌రే, తదితర యూనిట్ల పునరుద్ధరణ లాంటి వాటితో మెరుగైన ఆయుర్వేద వైద్య సేవలు అందుతాయని భావిస్తున్నారు.

మొత్తం పోస్టులు 61, ఖాళీలు 38...

రిటైర్ అవుతున్న సిబ్బంది స్థానంలో ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయలేదు. ఆసుపత్రిలో 120 పడకలున్నా 58పడకల స్థాయిలోనే 61సాంక్షన్ పోస్టులుండగా మరో 31 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బయోకెమిస్ట్-1, హెడ్ నర్సు-1, స్టాఫ్ నర్సులు-7, ఫార్మసిస్టులు-2, ల్యాబ్ టెక్నిషియన్-1, రేడియోగ్రాఫర్-1, డార్క్‌రూం అసిస్టెంట్-1,ఎక్స్‌రే అసిస్టెంట్-1, ఏఎన్‌ఎం-1, పంచకర్మ మాసాజిస్ట్-1, నర్సింగ్ ఆర్డర్లీ-4 పోస్టులతో పాటు దాయ, కుక్, స్వీపర్, వాచ్ మెన్, స్కావెంజర్, వాటర్‌మెన్, డ్రైవర్, ఆఫీస్ సబార్డినేట్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫార్మసిస్ట్ శిక్షణ పొందిన సిబ్బంది ఉన్నా ఆయుష్ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ ప్రమోషన్ ఇవ్వకపోవటంతో ఫార్మసిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొందరు వైద్యులు డిప్యూటేషన్‌పై రావడంతో కొంతమేరకు కొరత తీరింది. అలాగే అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య విద్యార్థులు, హౌజ్‌సర్జన్‌లు కూడా సేవలు అదిస్తు న్నారు. ఇక ఆసుపత్రి ఆవరణ, విభాగాలను శుభ్రం చేసే సిబ్బంది సరిపడా లేరు.



ఆయుర్వేద ఆస్పత్రి పంచకర్మ విభాగంలో రోగులు

నర్సింగ్ సేవలు పూర్తిగా బంద్

ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలోని మొత్తం 8 నర్సింగ్ పోస్టులు ఖాళీగా ఉండటంతో నర్సింగ్ సేవలు అసలే లేవు. హెడ్ నర్సు ఒకరు, స్టాఫ్ నర్సులు ఏడుగురు రిటైర్ అవగా అప్పటి నుంచి ఖాళీగానే ఉంటున్నాయి. దీంతో రోగులకు వారి బంధువులే నర్సింగ్ సేవలు అందిస్తుండగా.. కొన్ని కేసుల్లో ఆయుర్వేద వైద్య విద్యార్థులు, హౌజ్ సర్జన్లు నర్సింగ్ సేవలందిస్తున్నారు.

దశాబ్దాలుగా ఎక్స్‌రే యూనిట్ మూత

రేడియో గ్రాఫర్, డార్క్ రూం, ఎక్స్‌రే అసిస్టెంట్లు రిటైర్ అవడంతో ఎక్స్‌రే యూనిట్ మూతపడింది. చివరకు పాతకాలం నాటి మిషన్ కావడంతో అది తుప్పు పట్టి పాడైపోయింది. దశాబ్దాలు గడుస్తున్నా పట్టించుకోక పోవడంతో రోగులు రూ.వందలు వెచ్చించి ప్రైవేట్ ఎక్స్‌రే సెంటర్‌లను ఆశ్రయిస్తున్నారు. అధునాతన మొబైల్ ఎక్స్‌రే యూనిట్‌ను ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది..

- ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి
- హైకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ చంద్రకుమార్

4లో..

బాబు జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయం: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 5: బాబు జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రాం జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. దేశ స్వాతంత్ర సమరయోధుడిగా, గొప్ప రాజకీయవేత్తగా, సామాజిక సమానత్వం కోంస తన జీవితకాల పోరాటం చేసిన సంస్కరణశీలి అని కొనియాడారు. దేశ రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన గొప్ప దార్శనికుడు జగ్జీవన్‌రాం అన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ శ్రీనివాస్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీసీఓ సంజీవరావు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సత్యవాణి పాల్గొన్నారు.



బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది..

- ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి
- రాష్ట్ర హైకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ చంద్రకుమార్
- కేయూలో ఘనంగా బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు


మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 5 : దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయిలో పెరుగుతోందని రిటైర్డు హైకోర్టు జడ్జీ జస్టిస్ బి.చంద్రకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండ కేయూలో బాబు జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ఎస్డీఎల్‌సీఈ సమీపంలోని బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి చంద్రకుమార్‌తోపాటు కేయూ వీసీ రమేశ్ ఇతర అధికారులు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ రాజమణి అధ్యక్షతన ఏర్పాటు జయంతిని నిర్వహించారు. ఇందులో భాగంగా 'కాంటెంపరరీ ఇష్యూష్ ఆఫ్ ఇండియన్ సొసైటీ' అనే అంశంపై జస్టిస్ బి.చంద్రకుమార్ హాజరై కీలక ప్రసంగం చేశారు. దేశంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థులలో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని చెప్పారు. జీవన సౌకర్యాలకు, ప్రమాణాలకు స్థూల, దేశీయ ఉత్పత్తి, తలసరి ఆదాయ గణాంకలలో పొంతనలేదన్నారు. దేశంలో పేదరికం ఎక్కువవుతోందన్నారు. రూ.80 లక్షల కోట్లన ల్లధనం ఉందన్నరని, కొద్దిమంది చేతుల్లోనే సంపద కేంద్రీకృతం అవుతోందని చెప్పారు. ప్రాజెక్టు అంచనాలను పెంచి ప్రజల సొమ్మును దోచుకుకుంటున్నారని చెప్పారు.

ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ తాటికొండ రమేశ్ మాట్లాడుతూ గొప్ప మార్గదర్శి, సమతాస్ఫూర్తి బాబు జగ్జీవన్‌రాం ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటంతో యువత ముందుండాలని చెప్పారు. విద్యతోనే మార్పు సాధ్యమన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ గొప్ప విలువలున్న మానవతామూర్తి జగ్జీవన్‌రాం అని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన తుమ్మల రాజమణి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రాంను ఆదర్శంగా తీసుకుని, యువత ఎదగాలని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశా కాంట్రాక్టు అధ్యాపకురాలు లక్ష్మి సభకు స్వాగతం పలుకగా, పీఆర్‌వో వల్లాల పృథ్వీరాజ్ వందన సమర్పణ చేశారు. చరిత్రఅండ్ టూరిజం ఫ్యాకల్టీ చిలువేరు రాజ్‌కుమార్ జస్టిస్ చంద్రకుమార్‌ను సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ప్రొఫెసర్ కె.వాసుదేవారెడ్డి, దూరవిద్య కేంద్రం ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొట్టే భాస్కర్, పాలమాకుల కొమురయ్య, బైరపాక ప్రశాంత్, పెండ్లి అశోక్‌బాబు, సుదయ్య, శ్రీధర్‌కుమార్ లోథ్, ప్రణయ్‌కుమార్, వెంకటేశ్, మాచర్ల ఐలేశ్, వంగాల సుధాకర్ పాల్గొన్నారు.


మూసివేసిన పాత బస్‌స్టేషన్

కొత్త బస్టాండ్ పనులు షురూ

- వరంగల్‌లో ఆర్టీసీ పాత భవనాల కూల్చివేత

గిర్మాజీపేట, ఏప్రిల్ 5 : నాలుగు దశాబ్దాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు సేవలు అందించిన వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఇక కనుమరుగు కానుంది. మొండిగోడలు, పరిశుభ్రంలేని టాయిలెట్లు, ప్రయాణికులకు భద్రతలేని శిథిలావస్థకు చేరుకున్న బస్‌స్టేషన్ స్థానంలో అధునాతన మల్టీలెవెల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి పనులు శుక్రవారం నుంచి పనులు మొదలయ్యాయి. రైల్వేస్టేషన్‌కు ఎదురుగా నాటి ప్రధాని దివంగత పీవీ నరసింహరావు 1986 డిజెంబరు 21న అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టిరామారావు ప్రారంభించారు. సిటీ, జిల్లా బస్‌స్టేషన్‌లతో కూడిన ఈ బస్‌స్టేషన్ నుంచి నిత్యం 600 ఆర్టీసీ బస్సుల్లో సుమారు 50వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా గత ప్రభు త్వం రూ.75కోట్ల 'కుడా' నిధులతో నూతన బస్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. గత జూన్ 17న అప్పటి మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మం త్రి కేటీఆర్ శిలాఫలకం వేయగా, ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్దిగంటల ముందు అప్పటి తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అక్టోబరు 9న పనులు ప్రారంభించారు. తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం, ఈ ఏడాది జరిగిన సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో బస్‌స్టేషన్ నిర్మా ణం పనులు మొదలు కాలేదు. తాజాగా దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖల మంత్రి కొండా సురేఖ నిర్మాణ పనులు మొదలు పెట్టాలని చెప్పడంతో 'కుడా' అధికారులు పనులు తిరిగి ప్రారంభించారు. ఏడు అంతస్థుల్లో అధునాతన బస్‌స్టేషన్‌లో 32 బస్ ఫ్లాట్‌ఫారాలు, మల్టీప్లెక్స్, రెస్టారెంటు,కమర్షియల్ కాంప్లెక్‌లు నిర్మించనున్నారు.

రాకపోకల నిలిపివేత..

కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం శుక్రవారం అధికారులు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా బస్టాండ్ మీదుగా వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఎస్ఎన్ఎం క్లబ్‌కు ఎదురుగా రైల్వే ప్రహరికి ఆనుకుని తాత్కాలిక బస్‌స్టేషన్ నుంచి ప్రస్తుతం బస్‌ల రాకపోకలు యథాతథంగా సాగనున్నాయి. శుక్రవారం పాత బస్‌స్టేషన్‌ను పూర్తిగా మూసివేశారు. లోనికి ఎవరూ వెళ్లకుండా పెద్దతాళ్లు కట్టారు. ఖాళీ చేసిన గదుల నుంచి ఇనుప సామగ్రి, డోర్లు, కిటికీలు, పైపుల తొలగింపును ముమ్మరం చేశారు. ఎక్స్‌కవేటర్‌తో ట్యాక్సీ స్టాండ్ ప్రాంతంలో గోతులు తీస్తున్నారు.


మూసివేసిన బస్‌స్టేషన్ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్‌లు



ప్రతిజ్ఞ చేపిస్తున్న ప్రొఫెసర్లు

సాంకేతిక వైద్యవిద్య వైపుగా పరుగు పెట్టాలి

- ప్రముఖ కార్డియాలజిస్ట్ కస్తూరి శ్రీధర్
- కేఎంసీలో ఘనంగా పట్టాల ప్రధానోత్సవం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 5 : కాకతీయ మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసించిన పూర్వవిద్యార్థులు ప్రస్తుతం మన దేశంలోనే కాకుండా, విదేశాల్లో నూ ఉన్నత వైద్యులుగా రాణిస్తున్నారని కేఎంసీ పూర్వవిద్యార్థి, ప్రముఖ కార్డియాలజిస్ట్ కస్తూరి శ్రీధర్ తెలిపారు. అలాగే సాం కేతిక వైద్యవిద్య వైపుగా పరుగులు పెట్టాలని సూచించారు. శుక్రవారం కేఎంసీ కళాశాల మైదాన ప్రాంగణంలో వైద్యవిద్యను పూర్తి చేసిన విద్యార్థుల పట్టాల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. వైద్య వృత్తిలో మానవత్వాన్ని విస్మరించవద్దని కోరారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్లు డాక్టర్ కవిత, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పట్టాల ప్రధానోత్సవ కార్యక్రమంలో కళాశాల మైదానంలో కోలాహాలం నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు వేడుకల్లో పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో వైద్యవిద్యను పూర్తి చేసుకుని పట్టాలు అందుకున్న నేపథ్యంలో విద్యార్థులు వారి బంధువులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



కుటుంబసభ్యులతో పట్టా అందుకున్న ఆనందాన్ని పంచుకుంటున్న వైద్య విద్యార్థి

గైనిక్‌లో పీజీ చేస్తా

- డాక్టర్ సాయిశ్రీభవ్య

తల్లిదండ్రులు, సోదరుడి సహకారంతో ఎంబీబీఎస్ పూర్తి చేశా. ఎమ్మెస్ గైనిక్ పూర్తి చేయాలని ఉంది. వైద్యవృత్తిలో పేదలకు సేవ అందించాలని ఉంది. తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేరుస్తా. పట్టా పొందడం ఆనందంగా ఉంది. అమ్మానాన్న కళ్లల్లో ఆనందం నాకు కనిపించింది.



మేళా ఈవెంట్‌లో ఆటలు ఆడుతున్న విద్యార్థులు



కరౌకీ ఈవెంట్‌లో పాటలు పాడుతున్న విద్యార్థులు



కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజ్ఞానం.. వినోదం..

నిట్‌లో కన్నుల పండువగా స్ప్రింగ్ స్ప్రీ ప్రారంభం

హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 : విజ్ఞానం, వినోదం కలగలిసిన స్ప్రింగ్ స్ప్రీ-2024 (వసంతోత్సవం) వేడుకలతో కాజీపేటలోని నిట్‌లో కోలాహలం నెలకొంది. శుక్రవారం ప్రారంభమైన ఈ వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన విద్యార్థులతో క్యాంపస్ సందడిగా మారింది. ప్రతి ఏటా ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో వరంగల్ నిట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 40 ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు 10 వేలమంది విద్యార్థులు పాల్గొంటున్నారు. విద్యార్థులకు ప్రతిభకు సానబట్టడంతో పాటు వారిలో దాగిఉన్న శక్తి సామర్థ్యాలు, సృజనాత్మకతను తట్టిలేపే 50కిపైగా ఈవెంట్లను ఇక్కడ నిర్వహిస్తున్నారు. గతంలో కన్నా ఈసారి సరికొత్తవి ప్రవేశపెట్టారు. విజ్ఞానం, వినోదం కలగలిసిన ఈ ఈవెంట్లలో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు. స్ప్రింగ్ స్ప్రీ మొదటి రోజు శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచే ఈవెంట్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 17 ఈవెంట్లను నిర్వహించారు. ఉదయం నుంచే విద్యార్థులు నిట్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకే అయిదువేల మందికిపైగా విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. శని, ఆదివారాల్లో కూడా రెండురోజులు రిజిస్ట్రేషన్లు జరిగి మూడు రోజుల్లో మొత్తంగా పదివేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు స్ప్రింగ్ స్ప్రీ నిర్వాహకులు తెలిపారు. రాత్రి నిట్ స్టేడియంలో నిర్వహించిన కొరియోనైట్ పాప్‌షో విద్యార్థులను ఉర్రూతలూగించింది. మ్యూజిక్ అనుగుణంగా విద్యార్థులు చిందులేశారు. చౌరస్తా, హరిచరణ్ బ్యాండ్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అంబరాన్నంటిన సాంస్కృతిక సంబరం

నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ సాంస్కృతిక సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం మొదటిరోజే టెక్నోక్రాట్స్ అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నిత్యం సాంకేతిక రంగంతో కుస్తీ పడుతున్న భావి భారత ఇంజనీర్లు వారిలోని సృజనాత్మక సాంస్కృతికతను బహిష్కృతం చేస్తున్నారు. సాంస్కృతికానికి సాంకేతికతను అద్దుతూ ఉత్సాహవంతమైన ఈవెంట్లను ప్రదర్శించారు. కాగా, నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ-2024ను నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి అట్టహాసంగా ప్రారంభించారు. ఆరంభషో అదిరింది.

ఆకట్టుకున్న ఈవెంట్లు..

- నిట్‌లోని ఏక్ భారత్ శ్రేష్ఠక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆహూతలను అలరించింది. ప్రముఖ కూచిపూడి నర్తకి తాడూరి రేణుక తన శిష్య బృందంతో కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు.
- యూత్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాలో వివిధ రకాలైన క్రీడలు నిర్వహిస్తారు. ఆసక్తిగల వారు మేళాలో నిర్వహించే అన్ని రకాల క్రీడల్లో ప్రతిభ కనబర్చాలి. వారి ప్రతిభ ఆధారంగా వారికి పాయింట్లు ఇస్తారు. అలాగే స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమంలో భాగంగా నిట్ యానిమీ అండ్ కామిక్ క్లబ్ ఆధ్వర్యంలో యానిమీ షోలు ప్రదర్శించారు.
- ఆరోహన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నుక్కడ్ నాటక్ అనే ప్రత్యేక నృత్య ప్రదర్శన ఆలోచింపజేసింది. సమాజంలో జరుగుతున్న వివిధ రకాల రుగ్మతల పట్ల సమాజం స్పందించాల్సిన తీరును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన విద్యార్థులు ఆహూతుల ప్రసంశలు అందుకున్నారు.
- అన్ సాల్వ్‌డ్ పేరుతో నిట్‌లోని లిటరసీ అండ్ డిబేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆట గమ్మత్తుగా ఉండటంతోపాటు థ్రిల్లర్ సినిమాను తలపించింది. అనేక రకాల ప్రశ్నల నుంచి ఆరుగురు అనుమానితుల నుంచి అంశం. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి హంతకులను గుర్తించడం ఈ ఆటలో ప్రధాన అంశం.
- ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ అఫైర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇట్ వరంగల్ గాట్ టాలెంటెడ్ కార్యక్రమం అద్భుతంగా సాగింది. సుమారు 100 మంది విద్యార్థులు ఈ షోలో పాల్గొని వారి కళలను ప్రదర్శించి వీక్షకుల ప్రశంసలు పొందారు. అలాగే మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గానలహరి కరోకే టెక్నోక్రాట్‌లకు కిర్రాక్ లేపింది. ఆసక్తి ఉన్నవారు తమ గాత్రాన్ని పరిచయం చేసుకుని శ్రోతలను మెప్పించాల్సి ఉంటుంది.
- ఆరోహన్ క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక సంబరంలో డ్రామా కాంపిటేషన్‌తో పాటు డ్రామా యాక్షన్ సన్నివేశాలను ఆవిష్కరించారు. వేషాలు, వేషధారణలు లేకుండా విద్యార్థులు వివిధ రకాల పాత్రలను పండించారు. విషాదాలు, విచిత్రాలు, హాస్యాలు, హాహాకారాలు ఇలా అనేక రకాలైన పాత్రలను విద్యార్థులు అవలీలగా పోషించారు.
- ఫిల్మ్ అండ్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాఫిక్ డిజైన్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఛాయ్ బిస్కెట్ సినిమా ఎడిటర్ డ్రాంప్ కిరణ్ పాల్గొని విద్యార్థులకు మెళకువలు నేర్పించారు. అనంతరం ఫిల్మ్ క్విజ్ నిర్వహించారు.
- డ్యాన్స్ అండ్ డ్రమెటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన రీల్‌రీల్ రెవ్లట్‌లో ఆన్‌లైన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఆసక్తి గల విద్యార్థులు పాల్గొని వారు చేసిన రీల్స్‌ను ఆన్‌లైన్‌లోనే ప్రదర్శించారు.
- ఫుడ్ హంట్ ఆహుతుల నోరూరించింది. నిట్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వారి ప్రాంతాలకు చెందిన శాఖాహార, మాంసాహార ప్రత్యేక పదార్థాలను ప్రదర్శించారు.



- వసంతోత్సవ సంబురంతో సందడిగా క్యాంపస్
- మొదలైన వివిధ ఈవెంట్లు.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- మూడు రోజులపాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆకట్టుకున్న చౌరస్తా, హరిచరణ్ బ్యాండ్

సంస్కృతి, సాంకేతికత సమ్మిళితంతో సరికొత్త ఆవిష్కరణలు

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాదర్ సుబుధి

సంస్కృతి, సాంకేతికత సమ్మేళితంతోనే సరికొత్త సృజన ఆవిష్కృతమవుతుందని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాదర్ సుబుధి అన్నారు. శుక్రవారం స్ప్రింగ్ స్ప్రీ వేడుకలను నిట్ ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సంస్కృతి, సాంకేతికత ఈ రెండు వేర్వేరు అయినా వీటి మధ్య అంతఃసూత్రం ఉందన్నారు. నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులు మానసికోల్లాసానికి, తమలోని సృజనకు పదునుపెట్టడానికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో తరుచూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య, స్టూడెంట్ ఆక్టివిటీ కౌన్సిల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరికృష్ణ, నిట్ కల్చరల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ బి.సంతోష్ బెన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



దుమ్మురేపిన ప్రోషో..

వసంతోత్సవంలో మొదటి రోజు ప్రోషో దుమ్మురేపింది. ప్రముఖ గాయకుడు హరిచరణ్ బ్యాండ్ షోతో విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. హరిచరణ్ పాటలు పాడుతున్నంత సేపు స్టేడియం మొత్తం కోలాహలంగా మారింది. అనంతరం మరో ప్రముఖ సింగర్ శిరీష తన గానంతో భావి భారత ఇంజనీర్లను సంభ్రమాశ్చర్యాల్లో ముంచి తేల్చారు. చౌరస్తా బ్యాండ్ షోతో టెక్నోక్రాట్స్ ఉర్రూతలూగారు. ఇద్దరు గాయకులు పాటలు పాడుతున్నంత సేపు స్టేడియంలో పూనకాలు లోడయ్యాయి. చరణ్, శిరీష వారి తాజా హిట్లలోని కొన్ని పాటలను పాడి వసంతోత్సవంలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆద్యంతం నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ - జ్యోత్స్నారాణి సుబుద్ధి దంపతులు పాలుపంచుకున్నారు.

స్ప్రింగ్ స్ప్రీలో నేటి కార్యక్రమాలు ఇవే..

రెండోరోజైన శనివారం.. సోలో ఐడల్, డైరెక్టర్స్ కట్, ఫిల్మ్ క్విజ్, హంగ్ గేమ్స్, ఫొటో పజిల్‌తో పాటు నకాష్ అజీజ్, లాహోర్ ద బ్లాక్ స్మిత్ బృందం ప్రోషోలు జరగనున్నాయి.


శ్రీహరిని కలిసిన కార్పొరేటర్లు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 5 : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కావ్యను వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పలువురు కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హనుమకొండలోని కడియం శ్రీహరి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. కావ్యకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవాల రాధికరెడ్డి, సిరంగి సునీల్‌కుమార్, జక్కుల రజిత వెంకటేశ్వర్లు, జన్ను శిభిరాణి అనిల్, ఈదురు అరుణ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 5 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సులమొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం వీసీ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి విడుదల చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఏ వొకేషనల్ తదితర కోర్సుల ఫలితాలను వెల్లడించారు. మొదటి సెమిస్టర్‌లో 24.41 శాతం ఉత్తీర్ణత సాధించగా, మూడో సెమిస్టర్‌లో 30 శాతం, ఐదో సెమిస్టర్‌లో 44.45 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్ https://kakatiya.a c.in/లో సంప్రదించాలని కోరారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి చాడ రాధికారెడ్డి, క్యాంపు ఆఫీసర్ ఆసీం ఇక్బాల్, నాయకపు సమ్మయ్య పాల్గొన్నారు.







బీ ఫార్మసీ విద్యార్థి ఆత్మహత్యాయత్నం
చికిత్స పొందుతూ మృతి


సౌమ్య (ఫైల్)

గీసుగొండ, ఏప్రిల్ 5: మైగ్రేన్ తలనొప్పి భరించలేక బీ ఫార్మసీ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం. కొనాయిమాకుల చెందిన కాందారి సౌమ్య (20) వరంగల్‌లోని ఫార్మసీ కళాశాలలో హాస్టల్‌లో ఉంటూ బీ ఫార్మసీ చదువుతోంది. సౌమ్య కొన్నేళ్లుగా మైగ్రేన్ తలనొప్పితో బాధపడుతూ మందులు వాడుతోంది. ఈక్రమంలో ఈనెల 2న తలనొప్పి పెరగడంతో తండ్రి శంకర్‌రావుకు ఫోన్ చేయగా ఇంటికి తీసుకువచ్చి హాస్పిటల్‌లో చూపించాడు.బుధవారం కూడా మళ్లీ నొప్పి రావడంతో భరించలేక ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగింది. కొద్దిసేపటికి విషయం తల్లి రాధికకు చెప్పగా వెంటనే ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్‌కుమార్ తెలిపారు.

10 బ్యాగులు.. 203 కిలోలు..

రైలులో ఎండు గంజాయి పట్టివేత.. ఇద్దరు మహిళల అరెస్టు

గిర్మాజీపేట, ఏప్రిల్ 5: విజయవాడ నుంచి మహా రాష్ట్రకు నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైల్లో అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల ఎండు గంజాయిని వరంగల్ రైల్వే పోలీసులు పట్టుకున్నారు. 50.85లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని, వాటిని తరలిస్తున్న ఇద్దరు మహిళలను రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం వరంగల్ ఆర్‌పీఎఫ్ ఠానాలో ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్ఆర్ కృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జీఆర్‌పీ సీఐ జి.నరేష్ వివరాలు వెల్లడించారు. కోడ్ నేపథ్యంలో ఆర్‌పీఎఫ్ ఎస్సై సుభాని ఆధ్వర్యంలో కానిస్టేబుల్స్ రాజు,గురువయ్య, లలిత, జీఆర్‌పీ కానిస్టేబుల్స్ బి.భాస్కర్, పి.రాజు, ఎల్.రామారావు, డి.రాములు బృందం గురువారం రాత్రి మహబూబాబాద్‌లో విజయవాడ నుంచి జల్గాం వెళ్తున్న నవజీవన్ ఎక్స్ ప్రెస్‌లో తనిఖీలు చేపట్టింది. జనరల్ కోచ్‌లో 10పెద్ద ప్లాస్టిక్ బ్యాగులతో ఇద్దరు మహి ళలు అనుమానాస్పదంగా కనిపించారు. చందాబాయి బీమా బెల్దార్ (62), ఉషా దిలీ ప్ చవాన్ (42) విచారించి, బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్‌లు లభిం చాయి. గంజాయితో మహిళలను అదే రాత్రి వరంగల్ ఆర్‌పీఎఫ్ ఠానాకు తరలించి విచారించగా మహారాష్ట్ర జల్గాంకు చెందిన తాము కూలీ పనిచేసుకుంటామని స్థానిక డొకరు విజయవాడ నుంచి ప్లాస్టిక్ సంచులు జల్గాంకు తీసుకువస్తే ఒక్కొక్కరికి రూ.10వేలు ఇస్తామని చెప్పటంతో తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. నిందితులను కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు పంపినట్లు సీఐ నరేష్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


కాంగ్రెస్‌లో చేరిన గీసుగొండకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు

గీసుగొండ, ఏప్రిల్ 5: మచ్చాపూర్‌కు చెందిన పలు పార్టీలకు చెందిన 30 మంది ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో కొనాయిమాకులలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం చేరారు. ఎంపీపీ భీమగాని సౌజన్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్, సీనియర్ నాయకులు సాయిలి ప్రభాకర్, పీసాల రాజేశ్వర్‌రావు, పత్తిపాక రవిందర్ పాల్గొన్నారు. కాగా, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులోని గణేషా కంపెనీలో కార్మికులకు 8 గం టలే పనిచేసేలా చూడాలని అందులో పనిచేసే కార్మికులు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని వేడుకున్నారు. కొనాయిమాకులలో వినతిపత్రం అందచేశారు.

• సంగెం : కాపులకనపర్తిలో బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సమక్షంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. గ్రామ నీటి సంఘం మాజీ చైర్మన్ పొలాల ప్రభాకర్, నల్లతీగల వెంకటే శ్వర్లు, తోటకూరి శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతి, సురేష్, రాజు చేరారు. కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు సదిరం చంద్రమౌళి, గ్రామ ఉప సర్పంచ్ సదిరం సారంగం పాల్గొన్నారు.

కొమ్మాలలో భక్తుల రద్దీ

గీసుగొండ, ఏప్రిల్ 5: కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరకు శుక్రవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సెలవు దినం కావడంతో ఆలయ ప్రాంగణం, క్యూలైన్‌లు సందడిగా మారింది. ప్రత్యేక, శీఘ్రదర్శనాల ద్వారా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. దాదాపు 5 వేల మంది వరకు భక్తులు దర్శించు కున్నట్లు ఈవో శేషగిరిరావు తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసాచార్యులు, అర్చకులు రామాచార్యులు, విష్ణుమాచార్యులు, ఫణింద్రాచార్యులు పాల్గొన్నారు.

దారికాచిన ముప్పు

ప్రమాదకరంగా మూల మలుపులు, బావులు
ఇరుకుగా మారిన వంతెన
రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి చెట్లు
కానరాని లైట్లు, సూచిక బోర్డులు
కొత్తపేట-ఏనుమాముల మార్కెట్ రోడ్ పై చిన్నచూపు



ఇరుకుగా మారిన వంతెన.. ప్రమాదకరంగా మూల మలుపు


రోడ్డుకు అనుకుని ఉన్న బావి

వరంగల్ సిటీ, ఏప్రిల్ 5: ఇరుకైన రోడ్డు.. వంకర్లు తిరిగిన దారితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన ఇరుకుగా మారడంతో ప్రమాదాల బారినపడుతున్నారు. కొత్తపేట నుంచి ఏనుమాముల మార్కెట్‌కు సుమారుగా మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అప్పటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని కెనాల్‌పై 40ఏళ్ల క్రితం కొత్త వద్ద ఎస్సారెస్పీ కెనాల్‌పై వంతెన నిర్మించారు. ఇప్పుడు అది పూర్తిగా ఇరుకుగా మారింది. ఆరెపల్లి, కొత్తపేట మీదుగా వందల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లు, ట్రాలీల్లో రైతులు తమ పంటను ఈ మార్గం గుండానే తరలిస్తుంటారు. కొత్తపేట కెనాల్‌పై నిర్మించిన వంతెన పూర్తిగా దెబ్బతింది. కాల్వ కూడా లోతు ఎక్కువ ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు, వాహనదారులు జంకుతున్నారు. అంతేకాదు రోడ్డు ఇరువైపులా ఎత్తులో ఉంటే వంతెన మాత్రం కింది ఉండడం మరింత ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా వాహనం కెనాల్‌లో పడే అవకాశముంది. దీనికితోడు ఎలాంటి లైట్లు లేకపోవడంతో వాహనదారులు సైతం ఆందోళన చెందుతున్నారు.

అడుగడుగునా మలుపులు..

వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు ఉన్నది కేవలం మూడు కిలోమీటర్లే కానీ, సుమారు 20 వరకు మూల మలుపులు ఉండడం ప్రమాకరంగా మారింది. పలుచోట్ల మూల మలుపుల వద్ద ఇరువైపులా తుమ్మచెట్లు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాల బారినపడుతున్నారు. కొన్ని చోట్ల పూర్తిగా ఎల్ ఆకారంలో, ఇంకొన్ని చోట్ల యూ ఆకారంలో మలుపులు ప్రమాదకరంగా మారాయి. అంతేకాదు భారీ వాహనాలతోపాటు, ట్రాక్టర్, ట్రాలీల్లో మిర్చి, పత్తి వంటి పంటను ఓవర్ లోడ్‌తో ఈ దారిగుండా ఎక్కువగా వస్తుంటాయి. ఇరుకు రోడ్లపై మూల మలుపు వద్ద వాహనాలు క్రాస్ అవడం కష్టం మారుతోంది.

కానరాని కరెంట్, సూచిక బోర్డులు..

ఈ మూడు కిలోమీటర్ల పొడవునా ఎక్కడ విద్యుత్ లైట్లు లేకపోవడంతో చీకటి పడిందంటే ఈ ప్రాంతం గుండా ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. నగరానికి కూత వేటు దూరంలో ఉన్నా.. మార్కెట్‌కు రైతులు పంట ఉత్పత్తులను తరలించేందుకు ప్రధాన మార్గాల్లో ఇదొకటైనా.. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ దారి వెంట పదుల సంఖ్యలో రోడ్డుపక్కనే బావులు ప్రమాదకరంగా మారాయి. ఇటు మూల మలుపుల వద్ద..అటు బావుల వద్ద అధికారులు కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు మండిపడుతున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొ రేషన్ పరిధిలో ఉన్నా, సంబంధిత అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. మరోపక్క ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన కార్పొరేటర్లు, ఎమ్మెల్యే సైతం ఈ సమస్యలపై దృష్టి సారించడం లేదని వాహనదారులు, ప్రజలు ఆరో పిస్తున్నారు.

కెనాల్‌పై మరో వంతెన నిర్మించాలి..



కాశెట్టి చందు, ప్రయాణికుడు

ఎప్పుడో 40ఏళ్ల క్రితం ఎస్సారెస్పీ కెనాల్‌పై వంతెన నిర్మించారు. అప్పటి అవసరాల మేరకు నిర్మించారు. ప్రస్తుతం ఆ రోడ్ ప్రధానంగా మారింది. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌తోపాటు అనేక మిల్లులు, పరిశ్రమలకు, నగరానికి రాకపోకలు సాగించేందుకు ఈ దారే ముఖ్యమైనది. దీంత రద్దీ పెరిగింది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

పిచ్చి చెట్లను తొలగించాలి..



కన్నెబోయిన నాగరాజు, ప్రయాణికుడు

కొత్తపేట -ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ రోడ్ మూడు కిలో మీటర్ల దూరం ఉంటది. కానీ, ముప్పై మలుపులున్నాయి. వంద మీటర్లకో మలుపు ఉండడంతో భయమేస్తోంది. ఎల్, యూ టైప్ మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. పిచ్చిచెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయడం లేదు.


దీక్షలో మాట్లాడుతున్న అరూరి రమేష్

కాంగ్రెస్‌వి బోగస్ మాటలు

బీజేపీ రైతు సత్యాగ్రహ దీక్ష అరూరి రమేష్

మిల్స్‌కాలనీ, ఏప్రిల్ 5: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌వి బోగస్ మాటలని వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ దుయ్యబట్టారు. శుక్రవారం వరంగల్ ఎంజీఎం చౌరస్తాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. అరూరి మాట్లాడుతూ... అన్ని హామీ లు నెరవేరుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారని ఆరోపించారు. కేంద్రం వరికి ఇస్తున్న మద్దతు ధర రూ.2,200 అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500కలిపి మొత్తం రూ.2700 చెల్లించాలన్నారు. మార్కెట్‌కు ధాన్యం వస్తున్నా ప్రభుత్వం ఇంకా కొనుగోళ్లు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు.

గంట రవికుమార్ మాట్లాడుతూ.. రైతుకు పంట బీమా సౌకర్యం కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. రైతులకు కనీసం సాగునీరు అందించలేని దుస్థితిలో సీఎం రేవంత్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. రైతు భరోసా కింద కౌలు రైతులకు రూ. 12 వేలు ఇవ్వాలన్నారు. రైతు కూలీలకు ఇస్తామని రూ. 15 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, పార్లమెంట్ ప్రభారి ఎడ్ల అశోక్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, డాక్టర్ విజయచందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లాడి తిరుపతిరెడ్డి, అధికార ప్రతినిధులు బండి సాంబయ్య యాదవ్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి శేషాద్రి, జిల్లా ప్రధానకార్యదర్శులు హరిశంకర్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రంజిత్, నరేష్, శివప్రసాద్, రంజిత్‌రావు, దామోదర్‌రెడ్డి, ప్రభాకర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ పాల్గొన్నారు.

కొమురారెడ్డిని కలిసిన నాయకులు

గీసుగొండ, ఏప్రిల్ 5: నియోజవవర్గ అధికార ప్రతినిధిగా ఎంపికైన చాడా కొమురారెడ్డిని గీసుగొండలోని ఆయన నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాగారపు స్వామి, నాయకులు సాయిలి ప్రభాకర్,నాగరాజు కలిసి అభినందించారు. సామాజికవేత్త, పెగళ్లపాటి లక్ష్మీనారాయణ, గీసుగొండ ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగల సాంబరెడ్డి కూడా సన్మానించారు.

ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ: సీఐ


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ మల్లయ్య

కరీమాబాద్, ఏప్రిల్ 5: ప్రజల సహకారంతోనే నేరాల నియంత్ర సాధ్యమని మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య అన్నారు. శుక్రవారం రాత్రి శంభునిపేట జంక్షన్‌లో స్థానికులు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ కాలనీల్లో గంజాయి అమ్మకాలు, సైబర్ క్రైం బాధితుల వివరాలు, ఆకతాయిల సమాచారం, దొంగతనాలు, అనుమానిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అద్దెలకు వస్తున్న వారి పూర్తి వివరాలు ఆధార్ కార్డులు తప్పని సరిగా పరిశీలించాలని సూచించారు. బెల్టుషాపులను నిర్వ హించడం చట్టరీత్యా నేరమని, బెల్టు షాపుల నిర్వాహకుల పై చర్యలు తీసకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై గోవర్ధన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాకేష్ (ఫైల్)

హసన్‌పర్తి, ఏప్రిల్ 5 : మండలంలోని అనంతసాగర్ వద్ద శుక్రవారం తెల్లవారు జామున హనుమకొండ-కరీంనగర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఇన్‌స్పెక్టర్ జవ్వాజి సురేష్ కథనం ప్రకారం. వరంగల్ మండలం ఆరెపల్లికి చెందిన యాద రాకేష్ (24) డిగ్రీ పూర్తి చేసి తనతాత బుర్రి చేరాలు దగ్గరనే ఉంటున్నాడు. రఘునాథపల్లికి చెందిన మరో విద్యార్థి బాలుగు కౌశిక్, తన మిత్రుడైన రాకేష్ ఇంటికి గురువారం వచ్చాడు. వీరిద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై ఎల్కతుర్తిలో రాకేష్ బంధువుల పెళ్లికి హాజరై.. శుక్రవారం ఉదయం నాలుగు గంటల సమయంలో ఆరెపల్లికి వస్తున్నారు. ఈ క్రమంలో అనంతసాగర్ వద్దగల కోళ్ల ఫారం దగ్గరకు రాగానే గుర్తుతెలియని వాహనం వీరి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. దీంతో వీరిద్దరూ దూరంగా ఎగిరిపడడంతో రాకేష్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాల పాలైన కౌశిక్‌కు స్థానికుల సమాచారంతో 108 ద్వారా చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించి చికిత్స నందిస్తున్నారు. మృతుని తాత బుర్రి చేరాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పట్టభద్రుల ఓటరు తుది జాబితా అందజేత

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 5: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు శుక్రవారం అందజేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారా ణి తెలిపారు. ఏనుమాముల మార్కెట్ యార్డు గోడౌన్‌లో ర్యాండమైజేషన్ పూర్తిచేసిన ఈవీఎంల కేటాయింపు సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తుది ఓటర్ జాబితాను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, ఉప తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అనిల్ కుమార్, రాజే ష్, లక్ష్మణ్, బాబురావు, భిక్షపతి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్

'మంత్రిని విమర్శిస్తే ఊరుకోం'

గిర్మాజీపేట, ఏప్రిల్ 5: ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు చేస్తే ఊరుకోమని ప్రదేశ్ కాంగ్రెస్ నాయకుడు మీసాల ప్రకాష్ అన్నారు. శుక్రవారంనగరంలోని దయానంద్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేటీఆర్ మాట్లాడిన తీరుతో ఫో న్ ట్యాపింగ్ వెనుకు ఎవరున్నారనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. కేటీఆర్ పంపిన లీగల్ నోటీసలకు సురేఖ భయపడరన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అంబి సాంబరాజు, ప్రభాకర్, లావణ్య, పుష్ప పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

సంగెం, ఏప్రిల్5: మామునూరు టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్‌లో కమాండెంట్ శివప్రసాద్ ఆధ్వర్యంలో బేగంపేట్ మెడికవర్ హాస్పిటల్ వైద్యుల నిర్వహణలో బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్లకు శుక్రవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న 453 మంది పోలీసు కానిస్టేబుళ్లకు గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీనివాస్‌రావు, వీరన్న, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అన్వేషిణి పాల్గొన్నారు.

ఘనంగా జగ్జీవన్‌రాం జయంతి


దేశాయిపేటలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గంట రవికుమార్

పోచమ్మమైదాన్, ఏప్రిల్5: దివంగత నేత, నాటి కేంద్రమంత్రి, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రాం జయంతి వేడుకలను శుక్రవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. పోచమ్మమైదాన్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహ్మద్ వసీం, జన్ను రవి, చిప్ప వెంకటేశ్వర్లు, అంబి సాంబరాజు, దామెర సర్వేషం, బొట్ల ప్రసాద్, వీరన్న పాల్గొన్నారు.

» సంగెం: బాబూ జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్ ఆధ్వర్యంలో మామునూరు టీఎస్ఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు శ్రీనివాస్‌రావు, వీన్న, ఆర్‌ఐలు శోభన్, పురుషోత్తమరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సంగెంలో మండల అంబేడ్కర్ యువజన సంఘం కన్వీనర్ మెట్టుపల్లి సునీల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో జగ్జీవన్‌రావు చిత్రపటానికి నివాళులర్పించారు. గవిచర్లలో మాదిగ కుల సంఘం సహకార సొసైటీ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రావు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎ.బాబు, కార్యదర్శి భాషిపాక రమేష్ పాల్గొన్నారు.

» గీసుగొండ: జగ్జీవన్‌రాం జయంతిని ఎలుకుర్తి, అనంతారంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించగా జిల్లా ఉపాధ్యక్షుడు ఇనుముల పూర్ణయ్య, చందు, శ్రీను, నరేందర్, నాగరాజు, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు. ధర్మారం ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ కొక్కొండ శ్రీకాంత్, అధ్యాపకులు సూర్య, ప్రణయ్, రాజమౌళి పాల్గొన్నారు.

» కరీమాబాద్: బాబు జగ్జీవన్‌రాం జయంతిని రంగశాయిపేట వాగ్బాట యోగా అండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగశాయిపేట కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మార్గం నవీన్, సభ్యులు పెరుమాండ్ల మధు, రాంచందర్, సాంబయ్య, మోహన్, ప్రతాప్, చిన్నా, పాల్గొన్నారు.

» మిల్స్‌కాలనీ: బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ దేశాయిపేటలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పీఆర్టీయూ-తెలంగాణ జిల్లా అధ్యక్షురాలు కోలెపాక సంగీత బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ ప్రధానకార్యదర్శి కొండ్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఆరె రాకేష్‌రెడ్డి, ములుగు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘురెడ్డి, మురళి పాల్గొన్నారు.

» వరంగల్ కార్పొరేషన్ : నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి బల్దియా డిప్యూటీ కమిషనర్ రవీందర్, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌లు హాజరై సంయుక్తంగా మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌వో రమేష్, టీపీఆర్‌వో రాజేష్, ఈఈ సంజయ్‌కుమార్, సూపరింటెండెంట్‌లు బాకం సంతోష్, చీకటి ఆనంద్, జేఏసీ నాయకులు గౌరిశంకర్, గోల్కొండ శ్రీనివాస్, నాయకులు రాజారపు భాస్కర్, బొట్ల రమేష్, పాశం రవి యాదవ్, మాదసి సాంబయ్య పాల్గొన్నారు.


వాగ్బాట యోగా సంఘం ఆధ్వర్యంలో నివాళి


ఎలుకుర్తిలో నివాళులర్పిస్తున్న పూర్ణయ్య


మునిసిపాలిటీలో నివాళులర్పిస్తున్న అధికారులు



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శనివారం 6 ఏప్రిల్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రక్త పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఖానాపురం, ఏప్రిల్ 5 : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి జ్యోతి, సబ్ యూనిట్ ఆఫీసర్ నంద అన్నారు. బుధరావుపేట గ్రామంలోని ఎస్సీ కాలనీలో మలేరియా పాజిటివ్ కేసునమోదు కావడం తో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. జీపీ సిబ్బంది ఆధ్వర్యంలో మురుగు కాలువల్లో దోమల నివారణ మందులను స్ప్రే చేయించారు. 28 మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులను అంద జేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ భాస్కర్, జ్యోతి, భవాని, లలిత, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రోధి నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ



పంచాంగ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వికాస తరంగిణి సభ్యులు, భక్తులు

నర్సంపేట టౌన్, ఏప్రిల్ 5 : నర్సంపేట పట్టణంలోని శ్రీవేంకటేశ్వరాలయంలో ఉభయ వేదాంత పండితుడు సంపన్ముడుంబై వెంకటాచార్యులు గణించిన తెలుగు నూతన సంవత్సరం క్రోధి నామ సంవత్సర పంచాంగ పుస్తకాలను ధరణిశ్రీ ఫౌండేషన్ సౌజన్యంతో, వికాస తరంగిణి ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటాచార్యులు మాట్లాడుతూ రాబోయే క్రోధి నామ సంవత్సరంలో కుటుంబాల్లో పరస్పర అవరోధములు కలిగి ఉంటారని, రాజకీయ నాయకులలో పరస్పర విభేదాలతో పరిపాలన వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంటుందన్నారు. వర్షాపాతం తక్కువగా ఉంటుందని, మే నెలలో అకాల వర్షాలతో రైతులు పంట నష్టపోయి కొంత ఇబ్బంది పడనున్నట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు, మాధవాచార్యులు, వికాస తరంగిణి కార్యదర్శి రంగనాథస్వామి, తదితరులు పాల్గొన్నారు.

10 బ్యాగులు.. 203 కిలోలు..

రైలులో ఎండు గంజాయి పట్టివేత .. ఇద్దరు మహిళల అరెస్టు

గిర్మాజిపేట, ఏప్రిల్ 5 : విజయవాడ నుంచి మహారాష్ట్రకు నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైల్లో అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాళ్ల ఎండు గంజాయిని గురువారం వరంగల్ రైల్వే పోలీసులు పట్టుకున్నారు. రూ.50.85లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని, వాటిని తరలిస్తున్న ఇద్దరు మహిళలను రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం వరంగల్ ఆర్‌పీఎఫ్ ఠానాలో ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్ఆర్ కృష్ణతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జీఆర్‌పీ సీఐ జి.నరేష్ వివరాలు వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో ఆర్‌పీఎఫ్ ఎస్సై సుభాని ఆధ్వర్యంలో కానిస్టేబుల్స్ రాజు, గురువయ్య, లలిత, జీఆర్‌పీ కానిస్టేబుల్స్ బి.భాస్కర్, పి.రాజు, ఎల్.రామారావు, డి.రాములు బృందం గురువారం రాత్రి మహబూబాబాద్‌లో విజయవాడ నుంచి జల్గాం వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేపట్టింది. జనరల్ కోచ్‌లో 10 పెద్ద ప్లాస్టిక్ బ్యాగులతో ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా కనిపించారు. 62ఏళ్ల చందాబాయి టీమా బెల్దార్, 42ఏళ్ల ఉషా దిలీప్‌చవాన్‌ను విచారించి, బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్‌లు లభించాయి. గంజాయితో మహిళలను అదే రాత్రి వరంగల్ ఆర్‌పీఎఫ్ ఠానాకు తరలించి విచారించగా, మహారాష్ట్ర జల్గాంకు చెందిన తాము కూలీ పనిచేసుకుంటామని, స్థానికుడొకరు విజయవాడ నుంచి ప్లాస్టిక్ సంచులు జల్గాంకు తీసుకువస్తే ఒక్కొక్కరికి రూ.10వేలు ఇస్తామని చెప్పటంతో తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. నిందితులను కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు పంపినట్లు సీఐ నరేష్ తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి పండుగ

చెన్నారావుపేట, ఏప్రిల్ 5 : మండలంలోని ఉప్పరపల్లిలో ముదిరాజ్‌ల కుల దైవమైన పెద్దమ్మ తల్లి పండుగ వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ మాట్లాడుతూ కులంలో ఐక్యత, అభివృద్ధి కోసం ప్రతీ సంవత్సరం పెద్దమ్మ పండుగను నిర్వహిస్తామన్నారు. రానున్న రోజుల్లో పండుగ వేడుకలను గ్రామ గ్రామాన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కుల పెద్ద చిరబోయిన భిక్షపతి, యాకయ్య, పులి చేరాలు, చెలుకలపెల్లి చిన్న వీరాస్వామి పాల్గొన్నారు.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి సున్నా

ఆక్రమణకు గురవుతున్న పార్కు నిర్మాణ స్థలం

అధ్వానంగా అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు

ప్రజలకు తాగునీరే ప్రధాన సమస్య

పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

నర్సంపేట, ఏప్రిల్ 5 : జిల్లాలోనే నర్సంపేట నియోజక వర్గం ఆరు మండలాలతో పెద్ద దిక్కుగా విరాజిల్లుతోంది. జిల్లాలో రెండు మునిసిపాలిటీలు ఉండగా జనాభాపరంగా, ఆదాయపరంగా నర్సంపేట మునిసిపాలిటీ ముందజంలో ఉంటుంది. ఆదివారం జరిగే వారాంతపు సంత, షాపింగ్ కాంప్లెక్స్ అద్దెలు, ఇంటి పన్నుల ద్వారా రూ.4కోట్ల నుంచి రూ.5కోట్ల ఆదాయం ఉంటుంది. అయినా అభివృద్ధి మాత్రం కనిపించడంలేదు. 24 వార్డులు న్నారు.ఇందులో రెండు విలీన గ్రామాలు ఉన్నాయి. అంతర్గత రోడ్లు, డ్రైనేజీల వ్యవస్థ అధ్వానంగా మారింది. పట్టణ ప్రజకు పార్కులు లేక ఆహ్లాదం కరువైంది. ఫుట్‌పాత్‌లు, పార్కింగ్ స్థలాలులేక ప్రజలు, పాదాచారులు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్ల పక్కన వాహనం నిలిపితే పోలీసులు జరిమానా విధించే సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. పార్కింగ్ స్థలాలను గుర్తించడంలో మునిసిపల్, పోలీస్, ఆర్అండ్‌బి అధికారులు విఫలం చెందుతున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. అండర్ డ్రైనేజీ వ్యవస్థ లేకవార్డులు మురికికూపంగా మారుతున్నాయి.

కలగా మారిన అండర్ డ్రెయినేజీ నిర్మాణం

అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపడితే మురికి నీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించిన పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది. గ్రామ పంచాయతీ హయాంనుంచి మునిసిపాలిటీగా ఎదిగినప్పటికీ అప్పటి నుంచి నాయ కులు, ప్రజా ప్రతినిధులు హామీలు ఇచ్చి అండర్ డ్రైనేజీ నిర్మాణాన్ని మరచిపోయారు. ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అండర్ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువు

పట్టణ ప్రజలు, వ్యాపారులు, యువతీయువకులు,



ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

విద్యార్థులు కాసేపు సేదతీరడానికి పార్కులు కరువయ్యాయి. ఆదివారం సెలవు దినం రోజున ఉద్యోగులు, పిల్లతో ఆహ్లాద వాతావరణంలో గడపాలంటే పార్కు సౌకర్యంలేదు. పంచాయతీహయాంలో నెహ్రూరావి గ్రహం వద్ద ఏర్పాటుచేసిన పార్కు స్థలాన్ని గ్రంథాలయ భవనం, మహిళా మండలి భవనం, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించడంతో పార్కు కనుమరుగై పోయింది. నాటి నుంచి నాలుగు దశాబ్దాలుగా పార్కులు నిర్మాణానికి నోచుకోలేదు. పట్టణంలోని కుమ్మరికుంట స్థలంలో పార్కును నిర్మించడానికి నిధులు మంజూరైనా నిర్మాణ పనులను చేపట్టలేదు.మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పార్కు నిర్మాణానికి సుమారు రూ.3కోట్లు మంజూరీ చేయించారు. పార్కు నిర్మాణ స్థలాలను కలెక్టర్లు, అధికారులు పరిశీలించి వెళ్ళారే తప్ప పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకోలేదు. దీంతో పట్టణ ప్రజలకు ఆహ్లాదం కరువైంది. కుమ్మరి కుంటస్థలం ఆ క్రమణకు గురవుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కుమ్మరికుంట స్థలంలో మినీ పార్కునిర్మాణాన్ని పట్టించుకోని గత ప్రభుత్వం, మాజీ ఎమ్మెల్యే ఇదే పార్కు నిర్మాణ స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయించారు. పట్టణంలోని వల్లబ్ నగర్‌లో నిర్మించిన మినీస్టేడియంలో ఎలాంటి క్రీడలు నిర్వహించడంలేదు. ఈ నేపథ్యంలో కుమ్మకుంట స్థలంలో పార్కు నిర్మాణం చేపట్టకుండా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధుల స్పందించి కుమ్మరి కుంట స్థలంలో పార్కును నిర్మించి ఆహ్లాద వాతావరణం ప్రజలకు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీరే ప్రధాన సమస్య

పట్టణ ప్రజలు నాలుగు దశాబ్దాలుగా తాగు నీటి కోసం తల్లడిల్లుతున్నారు. పట్టణ ప్రజలకు తాగునీటిని అందించేందుకు అవసరమైన బావులు లేవు. గతంలో పలు చోట్ల ఉన్న మంచినీటి బావులు కనుమరుగయ్యాయి. దీంతో పాఖాల చెరువు నీటిపై ఆధారపడాల్సిన దుస్థితులను పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్నారు. పాకాల నీటిని పట్టణంలోని ద్వారకపేట సమీపంలోని మాటువీరారం కాలువ మాటువద్ద నిలువ చేసి గత కొన్నేళ్ళుగా డైరెక్టు పంపింగ్ ద్వారా వాటర్ ట్యాంకులను నింపి కులాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. నీరు కలుషితంగా వస్తుండడంతో చాలామంది ఇంటి అవసరాలకే వినియోగించుకుంటున్నారు. పేదలు మాత్రం గత్యంతరం లేక కులాయి నీటిని తాగాల్సిన దుస్థితులను ఎదుర్కొంటున్నారు. ఖానాపురం మండలం అయోధ్యనగర్ వద్ద టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి డీఫ్లోరైడ్ ప్రాజెక్టును రూ.38కోట్లతో ఏర్పాటుచేశారు. ఈ ప్రాజెక్టు నీటిని పట్టణ ప్రజలకు అధికారులు, ప్రజాప్రతినిధులు అందించలేకపోయారు. దీంతో ప్రాజెక్టు నిరుపయోగంగా మారి ఫిల్టర్‌బెడ్‌లు,



కుమ్మరికుంట మినీ పార్కు స్థలంలో క్రీడా ప్రాంగణం



ఎక్సైజ్ కార్యాలయం సమీపంలో రోడ్డు పక్కన పారుతున్న మురుగునీటిలో పందులు

యంత్రపరికరాలు పనికిరా కుండా పోయాయి. రూ:10 కోట్లు మంజూరీచేయించి డీఫ్లోరైడ్ ప్రాజెక్టును వినియోగంలోకితెస్తే పట్టణ ప్రజలకు ప్రతి రోజూ తాగునీటిని సరఫరా చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ దిశగా ఎమ్మెల్యే చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

విలీన గ్రామాల కూలీలకు ఉపాధి దెబ్బ

నర్సంపేటను నగర పంచాయతీ (మునిసిపాలిటీ)గా అప్‌గ్రేడ్ చేయడంకోసం 2011లో పట్టణంలోని సర్వాపురం, ద్వారకపేట గ్రామ పంచాయతీలను నర్సంపేటలో విలీనం చేశారు. దీంతో జాతీయ ఉపాధి హామీ పథకం నిర్వహించి కూలీలకు ఉపాధి కల్పించాలన్న నిబంధనలు లేకపోవడంతో ఈ రెండు గ్రామాలకు చెందిన సుమారు 2వేల మంది కూలీలకు గత పదమూడేళ్ళుగా ఉపాధి పనులు లభించక ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూలీలకు ఉపాధిఅవకాశాలు కల్పించేలా చూడాలని ప్రభుత్వాన్ని కూలీలు కోరుతున్నారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి



నర్సంపేటలో జగ్జీవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

నర్సంపేట, ఏ ప్రిల్ 5 : అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పోరాడిన యోధుడు బాబు జగ్జీవన్ రామ్ అని దళిత ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ గద్ద వెంకటేశ్వర్లు, ఎంఎస్‌పి జల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయ దీప్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసినివాళులర్పించి మాట్లాడారు. చివరి శ్వాస విడిచేవరకు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన మాజీ దేశ ఉపప్రధాని జగ్జీవన్ రామ్‌కు రాబోయే నూతన కేంద్ర ప్రభుత్వం భారతరత్న బిరుదును ప్రకటించి గౌరవించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకుడు బొచ్చు రఘుపతి, హన్మకొండ ఆనంద్, ఎస్సీసెల్ డివిజన్ అధ్యక్షుడు కల్లెపెల్లి సురేశ్, కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు బానాల శ్రీనివాస్, దళిత ప్రజా సంఘాల నాయకులు బోయిని నారాయణ జాంబవ్, బాబురాజుయాదవ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దు, బొట్ల నరేష్ పాల్గొన్నారు.

అలాగే, పట్టణంలో ఎమ్మార్పీఎస్‌టీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్‌టీఎస్ జిల్లా అధ్యక్షుడు మైసి శోభన్‌బాబు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఆరెపెల్లి బాబు మాట్లాడుతూ దేశ ఉప ప్రధానిగా దేశ ప్రజలకు, అణగారిన ప్రజా సమస్యలను పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో చిలపాక బాబు, మాదాసి సదానందం, బాణాల శ్రీనివాస్, వేల్పుగొండ రాజు, మైసి దేవేందర్, మాదాసి కుమార్, కుక్కమూడి సూరి, ఇస్రంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఆయా గ్రామాలతో పాటు పట్టణంలో భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని ఇల్లందలో పీఏసీఎస్ ఛైర్మన్ రాజేష్ కన్నా, మాజీ సర్పంచ్ తూళ్ల కుమారస్వామి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించి నివాళులర్పించారు. వర్ధన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమణ, ఏపీవో నాగేశ్వర్ రావు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిచారు. వర్ధన్నపేట అంబేడ్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్యల ఆధ్వర్యంలో వేరువేరుగా జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సమ్మెట సుధీర్, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, మైస సురేష్, సమ్మెట మహేందర్, పోశాల వెంకన్న, కీమా నాయక్, బాలకృష్ణ, తుమ్మల రవీందర్ పాల్గొన్నారు.

● రాయపర్తి : మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రంలో స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రాయపర్తిలోని ఆయన విగ్రహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు.జగ్జీవన్ రామ్ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని, ఆయన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సైతం జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించి, ఆయన విగ్రహానికి బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యా నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, బీఆర్ఎస్ నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, ఐత రాంచందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

● నెక్కొండ : భారతదేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నెక్కొండలోని అంబేడ్కర్ భవనంలో వివిధ దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెక్కొండలోని ప్రధాన కూడళ్లలో పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఈదునూరి యాకుబ్, ఎమ్మార్పీఎస్‌టీఎస్ జిల్లా ఇన్‌చార్జి ఈదునూరి యాకయ్య, జిల్లా నాయకులు కుమారస్వామి, రమేశ్, కొంగర సూర్యరావు, గారె శ్యాం, తడుగుల జనార్దన్, రఘునందన్ పాల్గొన్నారు.



రాయపర్తిలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

● ఖానాపురం : దేశ మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను మండల పరిషత్ కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ఆధ్వర్యం లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మహాలక్ష్మీ వెంకటనర్సయ్య ఏఎంసీ మాజీ ఛైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముడుసు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● నల్లబెల్లి: మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆవరణలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సామాజిక వేత్త భట్టు సాంబయ్య మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ప్రజల కోసం నిరంతరం పనిచేసిన మహనీయుడని, ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో జన్ను జయరావు, ప్రకాష్, శివప్రసాద్, చేరాలు పాల్గొన్నారు.

● పర్వతగిరి: భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మాదిగ ఐక్య సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జన జాతరను విజయవంతం చేయాలి

చెన్నారావుపేట, ఏప్రిల్ 5 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో చేపట్టిన జన జాతర బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ సిద్దెన రమేష్ పిలుపు నిచ్చారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని గెలుపించుకోవాలన్నారు. యువకులు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు బండి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ

నల్లబెల్లి, ఏప్రిల్ 5 : మండలంలోని శుక్రవారం కొండాపూర్‌లో శంఖు, పోచమ్మతల్లి, భక్తాంజనేయస్వామి, నంది సహిత శివలింగం, గణపతి, ఎర్రమ్మతల్లిలతో పాటు బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పురోహిత బృందం సమక్షంలో జరిగిన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం నూతన బొడ్రాయి విగ్రహం వద్ద టెంకాయను సమర్పించారు. ఆయన వెంట నాయకులు బానోతు సారంగపాణి, చెట్టుపల్లి మురళీధర్, ఊడుగుల ప్రవీణ్, కక్కెర్ల శ్రీనివాస్, ఇంగ్లీ శివాజీ, గూబ తిరుపతమ్మ రాజు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


తల్లీకొడుకులకు గాయాలు

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 5 : రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకులకు గాయాలైన సంఘటన మండలంలోని బండౌతపురం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... రాయపర్తి మండలానికి చెందిన చెందిన శీనపెల్లి రజిత తన కుమారుడు ప్రణయ్ ద్విచక్ర వాహనంపై తల్లిగారి ఊరైన బండౌతపురం వెళ్తుండగా గ్రామశివారులో బైక్ అదుపు తప్పి కిందపడడంతో గాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు 108సహాయంతో వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రజితకు తలకు బలమైన గాయంకావడంతో మెరుగైన చికిత్సకోసం వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

పట్టభద్రుల తుది ఓటరు జాబితా అందజేత

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 5:ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు శుక్రవారం అందజేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. ఏనుమాముల మార్కెట్ యార్డు గోడౌన్‌లో ర్యాండమైజేషన్ పూర్తిచేసిన ఈవీఎంల కేటాయింపు సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తుది ఓటర్ జాబితాను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించామన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, ఉప తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అనిల్ కుమార్, రాజేష్, లక్ష్మణ్, బాబురావు, భిక్షపతి పాల్గొన్నారు.


కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

పర్వతగిరి, ఏప్రిల్ 5: ఉమ్మడి వరంగల్ జిల్లా కబడ్డీ పోటీలను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం, బాబూ జగ్జీవన్‌రాం యూత్ ఆధ్వర్యంలో మండలంలోని వడ్లకొండ గ్రామంలో ప్రారంభించారు. పోటీలను తహసీల్దార్ వెంకటస్వామి, డిప్యూటీ తహసీల్దార్ హారతిలు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. మూడురోజుల పాటు నిర్వహించనున్న పోటీల్లో 42జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు మాదారపు మాణిక్యం, మండల కన్వీనర్ వల్లందాసు వెంకన్న, గౌరవ అధ్యక్షుడు మంద వెంకన్న, వల్లందాసు వెంకన్న, గ్రామ అధ్యక్షుడు వల్లందాసు రమేష్, ఉమ్మడి జిల్లా రెఫరీసంఘం ఛైర్మన్ ఎస్కె.హసన్, కుమారస్వామి, క్రీడాకమిటీ అధ్యక్షుడు మంద రాము పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి



అశోక్‌నగర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

ఖానాపురం, ఏప్రిల్ 5: వేసవికాలం దృష్ట్యా నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) భీమా నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని అశోక్‌నగర్ ఫారెస్ట్ నర్సరీని, ప్లాంటేషన్, పాకాల బయోడైవర్సిటీ పార్క్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ప్లాంటేషన్లను అభివృద్ధిచేసి అడవుల విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. అదేవిధంగా పాకాలలో ఈకో టూరిజం అభివృద్ధి కోసం చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఫారెస్ట్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో అనుజ్‌అగర్వాల్, నర్సంపేట రేంజ్ అధికారి రవికిరణ్, డీఆర్వో నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు నిరసన దీక్షను విజయవంతం చేయాలి

నల్లబెల్లి, ఏప్రిల్ 5 : నర్సంపేట గెస్ట్‌హౌస్ వద్ద ఈ నెల 6వ తేదిన జరిగే రైతు నిరసన దీక్ష కార్యక్రమానికి బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి దీక్షను విజయవంతం చేయాలని శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు బానోతు సారంగపాణి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను నేటి వరకు నేరవేర్చలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు చెట్టుపెల్లి మురళీధర్, ఊడుగుల ప్రవీణ్, కక్కెర్ల శ్రీనివాస్, గందె శ్రీనివాస్ గుప్తా, మామిండ్ల మోహన్‌రెడ్డి, ఇంగ్లీ శివాజీ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



బండౌతపురంలో మాట్లాడుతున్న అరూరి రమేష్

వర్ధన్నపేట రూరల్, ఏప్రిల్ 5 : బీజేపీతో దేశాభివృద్ధి సాధ్యమని, ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి ప్రధానమంత్రి కావాలని వరంగల్ బీజేపీ ఎంపీఅభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని బండౌతపురం గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 100మంది బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని కండువా కప్పి రమేష్ ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో వరంగల్ పార్లమెంటు అభ్యర్థిగా ఉమ్మడి జిల్లా ప్రజలకు సేవ చేసుకునేందుకు అదృష్టం వరించిందన్నారు. తనను, పార్టీని నమ్మి వస్తున్న వారి నమ్మకాన్ని వమ్ముచేయనని, అహర్నిశలు వారికి తోడుంటానని హామీ ఇచ్చారు. బండౌతపురం గ్రామాన్ని ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. కాంగ్రెస్ వస్తే దేశంలో అధోగతి పాలవుతుందని, మోదీతో సుపరిపాలన సాధ్యమని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో నేరెళ్ల కుమార్, ఉల్లి యాకయ్య, సింగనబోయిన యాకయ్య, బొర్ర లక్ష్మయ్య, గంగాపురం లచ్చమ్మ, నేరేళ్ల సంధ్య, మరుపట్ల వెంకటయ్యచ, కలమ్మలతోపాటు 100మంది చేరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, జడ్పీ వైస్ ఛైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కేశవరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ రాజేశ్వర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపుపై దృష్టి సారించాలి

రాయపర్తి, ఏప్రిల్ 5 : వరంగల్ పార్లమెంటు అభ్యర్థి అరూరి రమేష్ గెలుపుపై నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించాలని మండల ఎన్నికల కన్వీనర్ నూనె అనిల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపెల్లి శివారు దుబ్బ తండాలో బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బూత్‌స్థాయిలో పార్టీని పటిష్టంగా చేయాల న్నారు. సంస్థాగత పార్టీ ఉన్నప్పుడే మంచి ఫలితాలు వస్తా యని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.